31-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు తండ్రిని స్మృతి చేయండి, ఈ స్మృతియే విశ్వానికి యోగదానము వంటిది, దీని ద్వారానే విశ్వము పావనముగా అవుతుంది, నావ తీరానికి చేరుకుంటుంది"

ప్రశ్న:- ఏ పిల్లల యొక్క సంభాళన అంతిమ సమయంలో స్వయంగా బాప్ దాదానే చేస్తారు?

జవాబు:- ఏ పిల్లలైతే ఎంతోకాలంగా ముళ్ళను పుష్పాలుగా తయారుచేసే సేవలో తత్పరులై ఉంటారో, తండ్రికి పూర్తి-పూర్తి సహాయకులుగా ఉంటారో, అటువంటి పిల్లలను అంతిమ సమయంలో స్వయంగా తండ్రే సంభాళిస్తారు. బాబా అంటారు - నేను నా సహాయకులైన పిల్లలకు అద్భుతమైన దృశ్యాలను చూపించి ఎంతో ఆహ్లాదపరుస్తాను, వారు అంతిమంలో ఎంతో సుఖాన్ని చూస్తారు, సాక్షాత్కారాలు చూస్తూ ఉంటారు. 2- ఎవరికైతే "ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ లేరు" అన్న పాఠము పక్కాగా ఉంటుందో, అటువంటి పిల్లలకే తండ్రి సహాయము లభిస్తుంది.

పాట:- ప్రియతమా, వచ్చి కలుసుకో... (ప్రీతమ్ ఆన్ మిలో...)

ఓం శాంతి. ప్రియుడు మరియు ప్రేయసులు. ప్రియుడు ఒక్కరే మరియు ప్రేయసులు అనేకమంది ఉన్నారు. ప్రేయసులు ఒక్క భగవంతుడిని పిలుస్తున్నారు. అనేకమంది భక్తులు పిలుస్తున్నారు, ఎందుకు? సుఖము కోసము. కన్య - ప్రియతమా, వచ్చి కలుసుకో... అని పిలుస్తుంది. ఎందుకు? సుఖము కోసము. సుఖము కోసము నిశ్చితార్థం జరుగుతుంది. కానీ, ఇప్పుడు రావణ రాజ్యము ఉన్న కారణంగా ప్రియుని ద్వారా ఎటువంటి సుఖము లభించదు అని ఇప్పుడు పిల్లలు తెలుసుకున్నారు. రావణ రాజ్యములో సుఖము ఉండదు. ప్రేయసులందరూ శోకవాటికలో ఉన్నారు, అందుకే పిలుస్తారు. అశోక వాటికలో అలా ఎవరూ పిలవరు. ఏ దుఃఖమూ లేక శోకమూ లేనప్పుడు, ఎందుకు పిలుస్తారు? దుఃఖములోనే ప్రియుడిని తలచుకుంటారు, తర్వాత ప్రియుడు లభించడంతో అర్ధకల్పం ప్రేయసులు తలచుకోవడం నుండి విముక్తులవుతారు. అందరికన్నా మధురమైన, అందరికన్నా ప్రియమైన ప్రియుడు ఒక్క పరమపిత పరమాత్మయేనని, వారు అందరికన్నా ఉన్నతమైనవారు, అందరికన్నా శ్రేష్ఠమైనవారు అని ఇప్పుడు మీకు తెలుసు. ఇక్కడ మనుష్యులు ఎవరూ తమను తాము శ్రేష్ఠాతి శ్రేష్ఠులుగా చెప్పుకోలేరు. ఈశ్వరుడిని సర్వవ్యాపి అని, శివోహమ్ అని అంటారు కానీ ఒకరికన్నా ఒకరైతే శ్రేష్ఠంగా ఉండనే ఉంటారు కదా. సాధువులలో ఎవరైతే ఉన్నతులుగా ఉంటారో, వారికి ఇతర సాధువులు సాష్టాంగ ప్రణామము చేస్తారు. కానీ అందరికన్నా ఉన్నతోన్నతమైనవారు ఒక్క ప్రియుడైన పరమపిత పరమాత్మయే అని గానం చేయబడింది. తప్పకుండా సుఖము కొరకే అందరూ వారిని తలచుకుంటారు. ఎప్పుడైతే చాలా దుఃఖము ఉంటుందో, అప్పుడు ఎంతోమంది ప్రేయసులు వారిని తలచుకుంటారు. ఇప్పుడు పిల్లలకు అంతటి దుఃఖం యొక్క అనుభవం లేదు. ఇప్పుడింకా ఎంతో దుఃఖము రానున్నది. ఎవరినైతే పిలుస్తారో వారు తప్పకుండా వస్తారు కదా. అలాగే తండ్రి కూడా వస్తారు. తండ్రికి చెందినవారిగా అవ్వడంతో ఒక్క క్షణములో సుఖపు వారసత్వము లభిస్తుంది. మేము తండ్రి ఒడిని తీసుకున్నాము కావున క్షణములో జీవన్ముక్తి లభించింది అని పిల్లలకు నిశ్చయము ఉండాలి. బిడ్డ జన్మించినప్పుడు అతడిని ఒడిలోకి తీసుకుంటారు, అప్పుడిక అతడే వారసుడు అన్న నిశ్చయము ఏర్పడుతుంది. వీరు కూడా అనంతమైన తండ్రి. ఇప్పుడు మంచి రీతిలో వీరిని గుర్తిస్తారు. గుర్తించడంలో ఎలాంటి కష్టమూ లేదు. పిల్లలు ఎందరో ఉన్నారు, సన్ షోజ్ ఫాదర్ (కొడుకు తండ్రిని ప్రత్యక్షము చేస్తాడు) అన్న గాయనము ఉంది. కావున ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదు. అనేకానేకమంది బ్రహ్మాకుమార-కుమారీలు ఉన్నారు. ఇంతమంది పిల్లలు ఈశ్వరునికి తప్ప ఇంకెవరికీ ఉండరు. శ్రీకృష్ణుడైతే దైవీ గుణాల కల మానవుడు. మనుష్యులకు ఇంతమంది పిల్లలు ఉండరు. మనం శివబాబా పిల్లలమని మీకు తెలుసు. మనుష్యులెవరికీ ఇంతమంది పిల్లలు ఉండరని మీరు చెప్పవచ్చు. ఎంతమంది బ్రహ్మాకుమార-కుమారీలు ఉన్నారు. ప్రజాపిత బ్రహ్మా గురించి గాయనమైతే ఉంది కదా. త్రికాలదర్శి అయిన పరమాత్మను తలచుకుంటారు. భగవంతునికే ఇంతమంది పిల్లలు ఉండగలరు. ఆ నిరాకారుడు ఎప్పుడైతే సాకారంలోకి వస్తారో అప్పుడే దత్తత తీసుకుంటారు. శరీరము లేకపోతే ఎలా దత్తత తీసుకోగలరు? మీరు ఈశ్వరుని ఒడిలోకి వచ్చారు. వారే ప్రియుడని మీకు తెలుసు. వారు అందరికన్నా మధురమైనవారు, అందరికన్నా ప్రియమైనవారు. ప్రేమించేవారిని ప్రియుడు అని అంటారు. మీకు తెలుసు - మన ఉన్నతోన్నతుడైన ప్రియుడు వారే, వారి ద్వారానే ప్రేయసులైన మనకు స్వర్గం యొక్క అపారమైన సుఖాలు లభిస్తాయి. వారి సమ్ముఖంలో కూర్చున్నాము. రామ నామాన్ని తలచుకోవడం ద్వారా మనుష్యులు ఆవలి

తీరానికి చేరుకుంటారని భక్తి మార్గములో పాడుతారు కూడా, అందుకే రామా-రామా అని ఎంతగానో అంటూ ఉంటారు. గంగా నదిని పతిత-పావనిగా భావిస్తారు. మనుష్యులు అక్కడికి వెళ్ళి ఆకుపై దీపాన్ని వెలిగిస్తారు. శ్రీకృష్ణుడిని సాగరములో ఆకుపై బొటనవేలు చప్పరిస్తున్నట్లుగా చూపిస్తారు. దానికి గుర్తుగా వారు దీపాన్ని వెలిగించి ఆకుపై పెడతారు. ఆత్మ కూడా దీపమే. మనుష్యులకు పూర్తి జ్ఞానము లేదు. వారికి అది ఒక ఆచారం వలె అయిపోయింది. దీపాన్ని వెలిగించి, ఆత్మ తీరానికి చేరుకుంటుంది అని చెప్తారు. పరమపిత పరమాత్మను నావికుడు అని అంటారు. వారు విషయ సాగరము నుండి ఆవలి తీరానికి తీసుకువెళ్తారు. వారు ఈ మాటను విని దానిని ఒక ఆచారం వలె చేసేసారు. తండ్రి ఆత్మ దీపాన్ని వెలిగిస్తారు. ఇవన్నీ గుర్తులు. ఆత్మయే ఈ శరీరాన్ని విడిచిపెట్టి - అటువైపు ఉన్న ఆ పరంధామానికి వెళ్ళవలసి ఉంటుంది. ఆత్మ అజ్ఞాన సాగరము నుండి అటు వైపుకు వెళ్తుందని మీకు తెలుసు. నావికుడైతే ఒక్క తండ్రియే. గంగానదికి నావికుడు అన్న పదాన్ని ఇవ్వలేరు. నావికుడు లేక ప్రియుడు తోడుగా ఉండాలి. వారు ఎంతమందిని తమతో పాటు ఆవలి తీరానికి తీసుకువెళ్తారు, వారికే భిన్న-భిన్నమైన పేర్లను పెట్టారు. అంతేకానీ ఎవరూ అలా నావలో లేక స్టీమర్ లో కూర్చోబెట్టుకుని తీసుకువెళ్ళరు. స్మృతి యాత్రలో ఏ విధంగా ఉంటారు అనేది పిల్లలైన మీకు తెలుసు. ఇందులో నోటితో రామ-రామ అని అనవలసిన అవసరం లేదు. మనుష్యులు రామ-రామ అని అనమని చెప్తారు. మేము ఈ నామాన్ని దానం చేస్తున్నాము అని భావిస్తారు. తండ్రి అవినాశీ జ్ఞాన రత్నాలను దానమిస్తారు. వారంటారు - మధురాతి-మధురమైన ప్రియమైన ఆత్మలూ, తండ్రినైన నన్ను స్మృతి చేయండి. ఈ తండ్రి స్మృతియే విశ్వము కొరకు యోగదానము వంటిది. శివబాబాను స్మృతి చేయండి. వాస్తవానికి రామ అని కూడా పరమపిత పరమాత్మనే అంటారు కానీ మళ్ళీ రఘుపతి రాఘవ రాజా రామ్ అని అనేస్తారు. పిల్లలైన మీరు ఇప్పుడు డ్రామాను తెలుసుకున్నారు. స్వర్గము నుండి మొదలుకొని - ఎవరెవరు వచ్చారు, మళ్ళీ ఎలా వస్తారు అనేదంతా మీకు తెలుసు. ఏదైతే జరుగుతూ వచ్చిందో, అదంతా డ్రామాలో నిశ్చితమై ఉంది. ఈ భోగ్ మొదలైనవి పెట్టడం జరుగుతుంది - ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. ఏదీ కొత్త విషయం కాదు. మీరు సాక్షీగా అయి చూస్తారు. ప్రతి ఒక్కరూ పాత్రధారియే. వారు తమ పాత్రను అభినయించి సంతోషంగా తిరిగి వెళ్తారని మీకు తెలుసు.

మరణిస్తే స్వర్గవాసులు అయ్యారని మనుష్యులు అంటారు. మనం స్వర్గవాసులుగా అయ్యేందుకు పురుషార్థము చేస్తున్నాము అని మీకు తెలుసు. మనుష్యులు కాశీవాసం చేస్తారు కదా. గంగానది తీరంలో కూర్చుంటారు. శివుని మందిరము ఉంటుంది. శివుని స్మృతిలో ఎల్లప్పుడూ ఉంటారు. గంగకు కూడా మహిమను చేస్తారు. శివునికి కూడా మహిమను చేస్తారు. గంగలో ఎవరూ కాశీలో బలి అయినట్లుగా బలి అవ్వరు. తప్పకుండా పతిత-పావనుడు అయితే శివుడే. ఇది రహస్యము. శివుని మందిరము ఉంది. ఇంతకుముందు ఒక బావిలో శివునిపై బలిహారమయ్యేవారు. మీరు బెనారస్ వారికి మంచి రీతిలో జ్ఞానాన్ని ఇవ్వవచ్చు. వారితో ఇలా మాట్లాడండి - మీరు ఇక్కడ కూర్చున్నారు, గంగానది తీరము కూడా ఉంది, అలాగే శివుని మందిరము కూడా ఉంది, మరి మీరు శివునిపై ఎందుకు బలిహారము అవుతున్నారు? పతిత-పావనుడు శివుడా లేక గంగయా? వాస్తవానికి పతిత-పావనుడైతే శివుడే. భగవంతుని వద్దే బలిహారమవుతారు. భగవంతుడు భగవంతునిపై బలిహారమవుతారా? ఇలా జరుగదు. నేనూ భగవంతుడినే, నీవూ భగవంతుడివే అన్నట్లు కాదు. భగవంతుడు పతితునిగా అవ్వగలరా, మరి గంగ వద్దకు స్నానం చేయడానికి ఎందుకు వెళ్తారు. సర్వవ్యాపి జ్ఞానాన్ని మీరు వెంటనే దూరం చేయవచ్చు. పతిత-పావనుడు శివుడు - ఇది నిరూపించి చెప్పాలి. పిల్లలకు అర్థం చేయించేందుకు పాయింట్లను ఇవ్వడం జరుగుతుంది. కాశీలో అర్థం చేయించడం అన్నింటికన్నా సహజము మరియు మంచిది. శివుని మందిరము ఉందంటే తప్పకుండా వారు ఎప్పుడో వచ్చారని అర్థము. శివుడిని ఎల్లప్పుడూ బాబా అని అంటారు. వారికి తమదంటూ శరీరము ఎప్పుడూ లభించదు. ఆ మాటకొస్తే శివ అన్న పేరు ఎంతోమంది పిల్లలకు ఉంది. అలాగే శ్రీకృష్ణ అన్న పేరు కూడా లక్షలాది మందికి ఉంటుంది. కానీ ఆ శ్రీకృష్ణుడు అయితే సత్యయుగములో ఉండేవారు కదా. శ్రీకృష్ణుని భక్తులు శ్రీకృష్ణుని విగ్రహాన్ని తీసుకొని పూజ చేస్తారు. మనుష్యులకైతే చేయరు. కావున శ్రీకృష్ణుడు సత్యయుగములో ఉంటారని నిరూపించబడుతుంది. రాధే-కృష్ణులు ఎవరు, వారు ఎప్పుడు రాజ్యం చేసారు - ఇది మనుష్యులకు తెలియదు. ఇది తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు.

మీరు స్వదర్శన చక్రధారులు. విష్ణువుకు ఈ స్వదర్శన చక్రధారి అన్న పేరు ఎలా వచ్చింది, వారేమి చేసారు - ఈ విషయాలను ఎవరూ అర్థం చేయించలేరు. తండ్రి నిరాకారుడు. విష్ణువుకు ఇన్ని ఆయుధాలు ఎక్కడి నుండి వచ్చాయి - ఇది ఎవరికీ తెలియదు. ఇదంతా డ్రామాలో నిశ్చితమై ఉందని మనం అర్థం చేసుకున్నాము. భక్తి మార్గములో కూడా ఎవరైతే ఇంతకుముందు చిత్రాలను తయారుచేయించారో, వారే తయారుచేయిస్తారు. ఇదంతా తయారై-తయారుచేయబడిన ఆట. అర్ధకల్పం భక్తి, అర్ధకల్పం జ్ఞాన మార్గము నడుస్తాయి. ఈ విషయాల గురించి మీకే

తెలుసు. మీలో సత్యాతి-సత్యమైన ప్రేయసులు ఎవరైతే ఉన్నారో, వారికే ఆనందము కలుగుతూ ఉండవచ్చు. ఆ ప్రియుడైతే అసత్యమైనవారు, సత్యమైన మరియు అసత్యమైనవాటి మధ్యన తేడా అయితే ఉంటుంది కదా. అసత్యమైన ప్రియుడు మరియు సత్యమైన ప్రియుడు. పత్ని, తన పతిని ప్రియమైనవారు అని అంటుంది కదా. ప్రేయసులైన మనకు ఎటువంటి మధురమైన ప్రియుడు లభించారు అన్నది ఇప్పుడు మీకు తెలుసు. వారిని ప్రియుడు అని కూడా అంటారు, అలాగే తండ్రి అని కూడా అంటారు. తండ్రికి కూడా ప్రేమ ఉంటుంది. తండ్రి నుండి అయితే ఎంతైనా వారసత్వం లభిస్తుంది. ప్రియుడి నుండి ప్రేయసులకు వారసత్వమేమీ లభించదు. స్వయాన్ని ప్రేయసిగా భావించడం కన్నా బిడ్డగా భావించినట్లయితే వారసత్వం యొక్క రుచి కలుగుతుంది. శివుడిని ఎల్లప్పుడూ బాబా అని అంటారు. శివబాబాను శివపతి అని ఎప్పుడూ అనరు. ఇప్పుడు మీరేమీ శివుని నామాన్ని జపించకూడదు. కేవలం బాబాను స్మృతి చేయండి. పిల్లలు వచ్చినప్పుడు - మీరు ఎప్పుడైనా ఈశ్వరునికి చెందినవారిగా అయ్యారా? అని అడగడం జరుగుతుంది. ఎప్పటివరకైతే బిడ్డగా అవ్వరో అప్పటివరకు వారసత్వం లభించదు. వారు మాతా-పితలైనట్లయితే మరి సమ్ముఖంగా కలవాలి. నిశ్చయము ఏర్పరచుకుని వారిని కలుసుకోకుండానే మరణించినట్లయితే వారసత్వం లభించదు. ఈ విధంగా వారసత్వాన్ని పొందనివారు ఎంతోమంది ఉన్నారు. వారు ప్రజలలోకి వెళ్ళిపోతారు. వీరు ఆ మాతా-పితలే అని నిశ్చయము ఏర్పడినట్లయితే సమ్ముఖముగా రావలసి ఉంటుంది. ఇంకా సేవ చేసి తమ సమానంగా తయారుచేయాలి. ప్రజలను తయారుచేయాలి, అలాగే మీ వారసులను కూడా తయారుచేయాలి. ఇది ఇంట్లో కూర్చుంటే అవ్వదు కదా, శ్రమించాలి. ఈ విషయాలపై పిల్లలు విచార సాగర మథనం చేయరు. శ్రీకృష్ణలీల ప్రసిద్ధమైనది. లీల అయితే సత్యయుగములో జరుగుతుంది. ఇక్కడ ఏమైనా జరుగుతుందా. ఇక్కడ కాపీ చేస్తూ ఉంటారు. స్వర్గంలో ఏమేమి ఉంటాయి, ఎటువంటి మహళ్ళు ఉంటాయి - ఇది పిల్లలు అనుభవం చేసుకోగలరు. అక్కడి విషయాల గురించి ఇక అడగకండి, నోరు ఊరుతుంది. తండ్రి సుఖాన్నే ఇస్తారు. తండ్రిని దుఃఖము కొరకు ఏమైనా ఆహ్వానిస్తారా. ప్రపంచములో చాలా దుఃఖము ఉంది. ఒక ఇంట్లోకి బాధపెట్టే కోడలు వచ్చినట్లయితే ఇంటినంతా అల్లకల్లోలం చేసేస్తుంది. ఇటువంటి ఇళ్ళను బాబా ఎన్నో చూసారు. ఇప్పుడు సమయం చాలా కొద్దిగా ఉంది. తండ్రికి చెందినవారిగా అవ్వండి, అప్పుడు తండ్రి సహాయం చేస్తారు. వారసులుగానే అవ్వకపోతే వారసత్వాన్ని ఇచ్చేవారి సహాయం ఎలా లభించగలదు? తండ్రి అంటారు, భయపడకండి. షావుకార్లు అయితే భయపడతారు. ఈ తండ్రి అయితే దాత. భక్తి మార్గంలో కూడా మీరు నా పేరు మీద పేదలకు ఇచ్చేవారు. దాని అనుసారంగా జన్మ లభించేది. ఇప్పుడు డైరెక్టుగా చెప్తున్నాను - నాకు చెందినవారిగా అయినట్లయితే మీకు రాజ్య భాగ్యాన్ని ఇస్తాను. శివబాబా అయితే ఇళ్ళు మొదలైనవేవీ నిర్మించుకోవాల్సిన అవసరం లేదు. మిమ్మల్ని ఈ విధంగా అడుగుతారు - అంతా అంతమైపోనున్నది అన్నప్పుడు మరి ఈ ఇళ్ళు మొదలైనవి ఎందుకు తయారుచేస్తున్నారు? అరే, మరి ఎక్కడ ఉండాలి? చివర్లో కూడా పిల్లలు వచ్చి ఉండవలసి ఉంటుంది. మీరు చివర్లో ఎన్నో దృశ్యాలను చూస్తారు. ఎంతో సంతోషంగా ఉంటారు. సమయం ఎంతగా సమీపంగా వస్తూ ఉంటుందో, అంతగా బాబా ద్వారా ఎన్నో సాక్షాత్కారాలు జరుగుతూ ఉంటాయి. ఎవరైతే సహాయకులుగా అవుతారో వారు చివర్లో ఎంతో సుఖాన్ని చూస్తారు. దుఃఖపు సమయంలో ఎంతో సుఖాన్ని చూస్తారు. అది అద్భుతమైన సుఖము. పాకిస్తాన్ లో కూడా మీరు ఆనందముగా కూర్చునేవారు. వైకుంఠములో స్వయంవరాలు ఎలా జరుగుతాయి, లక్ష్మీ-నారాయణుల రాజ్యం ఎలా నడుస్తుంది - ఇవన్నీ బాబా సాక్షాత్కారం చేయించేవారు. ఒకవేళ శివబాబా మతంపై ముళ్ళను పుష్పాలుగా తయారుచేయడంలో సహాయం చేస్తూ ఉన్నట్లయితే మీరు ఎంతో చూస్తారు. పిల్లలు ధైర్యాన్ని ఉంచితే భగవంతుడు సహాయం చేస్తారని అంటారు. ఇటువంటి ప్రియుడిని అయితే ఎంతగానో స్మృతి చేయాలి. ఇది ప్రపంచానికి ఏమైనా తెలుసా. ఇంతమంది పిల్లలు ఉన్నారు, మరి తప్పకుండా వారికి మాతా-పిత ఉంటారు కదా, వారి ద్వారానే అపారమైన సుఖం లభిస్తుంది. ఈ మహిమ ఏమైనా లౌకిక తల్లిదండ్రులదా. ఎంతమంది పిల్లలు ఉన్నారు అనేది మీరు ప్రాక్టికల్ గా చూస్తారు. గాడ్ ఫాదర్ యే రచయిత. వారు రచిస్తారు, అంటే దత్తత తీసుకుంటారు కదా. ఎవరి ద్వారా? ఇది ముఖ వంశావళి. అర్థం చేయించడం చాలా సహజము. ఇప్పుడు ఈశ్వరుని ఒడి తీసుకుంటారు, ఆ తర్వాత దైవీ ఒడి లభిస్తుంది, ఆ తర్వాత ఆసురీ ఒడి. ఈ ఈశ్వరీయ ఒడి ద్వారా మనం శాంతిధామానికి, సుఖధామానికి వెళ్తాము. ఆసురీ ఒడి ద్వారా దుఃఖధామానికి వెళ్తాము. ఈ మంత్రాన్ని గుర్తుంచుకోండి. బంధనంలో ఉన్న గోపికలు పిలుస్తూ ఉంటారు. కావున వారి కొరకు ఏదో ఒక ప్రయత్నం చేయవలసి ఉంటుంది. బాబా చిన్న-చిన్న పల్లెటూర్లలోకి అయితే వెళ్ళలేరు. పెద్ద ఊర్లలోకి వచ్చి కలుస్తారు. వెళ్ళవలసి అయితే ఉంటుంది. బలిహారము కూడా ఏ విధంగా అవ్వాలి అనేది అర్థం చేయించడం జరుగుతుంది. జనక మహారాజు బలిహారమయ్యారు, ఆ తర్వాత - ఇప్పుడిక ట్రస్టీగా అయి సంభాళించండి అని చెప్పడం జరిగింది. రచన యొక్క పాలననైతే మీరు తప్పకుండా చేయాలి. మీరు స్వయాన్ని ఆత్మగా, ట్రస్టీగా భావించండి. మాయా రావణుడు దుఃఖాన్ని ఇస్తాడు, అందుకే రావణుడికి మందిరమేమీ లేదు. కేవలం దిష్టిబొమ్మను తయారుచేస్తారు. రావణుడు ఎంతో

దుఃఖమిచ్చాడు. ఎంతగా దుఃఖమిచ్చాడో అంతగానే ప్రతి సంవత్సరమూ అతడిని కాలుస్తూ ఉంటారు. శివబాబా సుఖమిచ్చారు, అందుకే వారి మందిరాలు చాలా వైభవోపేతంగా ఉన్నాయి. దుఃఖమునిచ్చే రావణునికి మందిరాలు ఉండవు. అతడికి సంబంధించినదేదీ కనే కనిపించని విధంగా అతడిని అంతం చేసేస్తారు. శివబాబా మందిరమైతే కనిపిస్తుంది. ఎంతగా పూజ జరుగుతుంది. వాస్తవానికి సదా పూజ్యులైతే ఒక్క శివబాబాయే, ఇంకెవ్వరూ కాదు. మీరు మళ్ళీ పూజ్యుల నుండి పూజారులుగా అవుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి స్మృతిలో ఉండాలి మరియు అందరికీ స్మృతిని ఇప్పించాలి, ఇదే దానము చేస్తూ ఉండాలి. తండ్రిపై బలిహారమై ఇక ట్రస్టీగా అయి సంభాళించాలి.

2. సాక్షీగా అయి ప్రతి పాత్రధారి పాత్రనూ చూడాలి. మనం పాత్రను అభినయించి సంతోషంగా తిరిగి వెళ్తున్నాము - ఈ స్మృతిలో సదా ఉండాలి.

వరదానము:- సదా తండ్రి సమానంగా అయ్యి తమ సంపన్న స్వరూపము ద్వారా సర్వులకు వరదానాన్ని ఇచ్చే వరదానీ మూర్త భవ

భారత్ లో విశేషంగా దేవీలను వరదానీ రూపములో తలచుకుంటారు. కానీ ఎవరైతే తండ్రి సమానంగా మరియు సమీపంగా ఉంటారో, వారే అటువంటి వరదానీ మూర్తులుగా అవుతారు. ఒకవేళ ఒక్కోసారి తండ్రి సమానంగా ఉంటూ, ఒక్కోసారి తండ్రి సమానంగా లేకుండా స్వయము యొక్క పురుషార్థులుగా ఉన్నట్లయితే, వారు వరదానులుగా అవ్వలేరు ఎందుకంటే తండ్రి పురుషార్థము చెయ్యరు, వారు సదా సంపన్న స్వరూపములో ఉంటారు. కనుక ఎప్పుడైతే సమానంగా అనగా సంపన్న స్వరూపములో ఉంటారో, అప్పుడే వరదానీ మూర్తులు అని అంటారు.

స్లోగన్:- స్మృతి అనే తీవ్ర పరుగును తీసినట్లయితే తండ్రి మెడలోని హారంగా, విజయీ మణులుగా అవుతారు.